క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ స్వాతి రెసిడెన్సీ, శివంహిల్స్, మన్సూరాబాద్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 11కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు, 11కేవీ వీరభద్రనగర్, ఆలిండియా రేడియో, లెక్చరర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ దేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీరప్ప జాతర

కందుకూరు: మండల పరిధిలోని గూడూరులో ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు బీరప్ప జాతర నిర్వహిస్తున్నట్లు పెద్దకురుమ బీమేష్ కురుమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4.30 గంటలకు స్వామివారి గంగ జెల్తి, గంగాపూజ, 25న ఉదయం స్వామివారికి వడుకు లగ్నం, సాయంత్రం బోనాల ఊరేగింపు, ఒగ్గు కథ, 26న శ్రీబీరప్పస్వామి కామరాతిదేవి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం బలి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 27, 28 తేదీల్లో రేణుకాఎల్లమ్మదేవి, మహంకాళీదేవి, బీరప్ప, కామరాతిదేవి ఒగ్గు కథలు, 29న స్వామి వారి గొర్లమందకు సల్లలు తాపుట, తొక్కుడు మైలలతో కార్యక్రమం పూర్తవుతుందని తెలిపారు. భక్తులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న రాజశ్యామల యాగం



పూజలో దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

తుక్కుగూడ: మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్‌లో చేపట్టిన చతురాయతన శత చండీ సహిత శ్రీ రాజశ్యామల మహాయాగం శుక్రవారం కూడా కొనసాగింది. రెండవ రోజు యాగంలో భాగంగా లక్ష కుంకుమార్చన, శివాభిషేకం, అష్టలక్ష్మి హవనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూళ్ల విజేయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, వారి కుటుంబ సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

21వ వార్డులో కంటి వెలుగు శిబిరం



కళ్లద్దాలు అందజేస్తున్న కౌన్సిలర్ ఫమీదా

పహాడీషరీఫ్: కంటి వెలుగు పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమీదా అన్నారు. వాదే ముస్తఫా బస్తీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫమీదా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తునారని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం సంతోషకరమన్నారు. ఇప్పటికై నా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి పేదల చెంతకే వైద్యాన్ని తీసుకొచ్చారన్నారు. కంటి సమస్యలతో బాధ పడుతున్న పేదలు వైద్యం చేసుకునేందుకు ఇబ్బందులు పడరాదన్న ఉద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కౌన్సిలర్ సవూద్ అవళ్గీ, మాజీ ఎంపీటీసీ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ సందడి షురూ..

- జల్‌పల్లిలో ఊపందుకున్న ఎద్దులు, మేకపోతుల విక్రయాలు
- పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలకు అధికారులు సన్నద్ధం
- తుక్కుగూడ, కందుకూర్‌లో చెక్‌పోస్టుల ఏర్పాటు
- గోవులను తరలిస్తే కఠిన చర్యలు: ఏసీపీ అంజయ్య



పహాడీ షరీఫ్‌లో గొర్రెపొట్టేళ్ల అమ్మకాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో వారం రోజుల ముందే బక్రీద్ సందడి మొదలయ్యింది. త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగకు పెద్దఎత్తున మూగజీవాలను ఖుర్బానీ ఇవ్వడం ఆనావాయితీగా వస్తుంది. ఇందుకోసం వ్యాపారులు ఎద్దులు, గొర్రె పొట్టేళ్లు, మేకపోతులను వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి పెద్దఎత్తున దిగుమతి చేస్తుంటారు. ఇప్పటి వరకు గొర్రె పొట్టేళ్ల దిగుమతి ఇంకా మొదలవ్వక పోయినప్పటికీ.... కోడెలు, ఎద్దుల దిగుమతి పెద్ద ఎత్తున కొనసాగుతోంది. వెరసి జల్‌పల్లి మున్సిపాలిటీలోని పలు ప్రదేశాల్లో ఎక్కడ చూసినా ఖుర్బానీ కోసం తెచ్చిన పశువులే దర్శనమిస్తున్నాయి. ఇంకా అమ్మకాలు ఊపందుకోని నేపథ్యంలో వ్యాపారులు వాటికి ఆయా ప్రదేశాల్లోనే ఎండుగడ్డి (గ్రాసం) ఆహారంగా ఇస్తున్నారు.

గోవులను తరలించకుండా చెక్‌పోస్టులు..

నగర శివారుగా ఉన్న పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధి నుంచి గోవులను తరలించకుండా పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తుక్కుగూడలోని అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసిన పోలీసులు రౌండ్ ది క్లాక్ సిబ్బందిని అందుబాటులో ఉంచి పశువుల రవాణా చేస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గోవుల తరలింపును అడ్డుకోవడంతో పాటు వధకు తరలించే పశువుల.. ఆరోగ్యానికి సంబంధించిన పశు వైద్యాధికారి అనుమతి పత్రాన్ని పరిశీలిస్తున్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

బక్రీద్ పండుగను పురస్కరించుకొని పోలీస్ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించారు. పెద్ద ఎత్తున జీవాలను ఖుర్బానీ ఇవ్వనున్న నేపథ్యంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు, పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో ముస్లిం ప్రతినిధులతో సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా ఖుర్బానీ వ్యర్థాలు పడేసేందుకు ఇంటింటికి పెద్ద సైజ్ ప్లాస్టిక్ కవర్లను అందించాలని మున్సిపాలిటీ అధికారులు నిర్ణయించారు. వ్యర్థాలతో రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి.పోలీసు నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవు. ముఖ్యంగాగోవధ నిషేధం ఉన్న నేపథ్యంలో గోవులు తరలించకుండా నిఘా ఏర్పాటు చేశాం. మహేశ్వరం డివిజన్ పరిధిలో తుక్కుగూడలోని అయ్యప్ప దేవస్థానం, కందుకూర్ అమూల్ దాబా సమీపంలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు తనిఖీలు చేపడుతున్నాం. గోవుల తరలింపు విషయంలో ఏమైనా సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలే తప్పా చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదు. ప్రజలు సహకరించాలి.

– అంజయ్య, మహేశ్వరం ఏసీపీ

రెసిడెన్షియల్ జోన్‌గా మార్చండి



మంత్రి సబితారెడ్డితో కందుకూరు బీఆర్ఎస్ నాయకులు

మంత్రి సబితారెడ్డికి బీఆర్ఎస్ నాయకుల వినతి

కందుకూరు: కందుకూరు మండలం హెచ్ఎండీఏ పరిధి మొత్తం కన్జర్వేషన్ జోన్‌లో ఉందని, రెసిడెన్షియల్‌గా మార్చేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలో 95 శాతంకు పైగా భూములు కన్జర్వేషన్ జోన్ పరిధిలో ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో లేని భూముల కంటే ఇక్కడ కన్జర్వేషన్ జోన్ కారణంగా అతి స్వల్పంగా ధరలు ఉన్నాయన్నారు. దీంతో అవసరమైన రైతులు భూములు విక్రయించాలంటే నష్టపోవాల్సి వస్తుందన్నారు. కాగా రైతులతో పాటు సీఎంను కలిసి సమస్య వివరిద్దామని వారికి మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిద్దామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచంద్రారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, డైరెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గణేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అంజయ్యగౌడ్, సదానంద్‌గౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి స్టేషనరీ సామగ్రి పంపిణీ



స్టేషనరీ సామగ్రి అందజేస్తున్న శివకుమార్, శేఖర్

మహేశ్వరం: మండల పరిధిలోని నందుపల్లి గ్రామానికి చెందిన దివంగత ఆకన్‌పల్లి జైపాల్ జయంతి సందర్భంగా తోటి మిత్రులు ఆకన్‌పల్లి శివకుమార్, రాజశేఖర్ పలువురు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం విద్యార్థులకు పలకలు, స్టేషనరీ సామగ్రి, పండ్లు పంపిణీ చేశారు. మా తోటి మిత్రుడు జైపాల్ మూడు సంవత్సరాల క్రితం పెద్ద గోల్కొండ ఔటర్ సర్వీస్ రోడ్డుపైన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారని వారి మరణం తమకు బాధాకరమని పేర్కొన్నారు. అతడి ప్రతి జయంతి, వర్ధంతికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. వారి తల్లితండ్రులు ఆకన్‌పల్లి శంకరమ్మ-నర్సింహ, బంధువులు శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్, ఉపేందర్, అశోక్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరిద్దాం



ఆమనగల్లు: ప్రజలతో మాట్లాడుతున్న ఆచారి

బీజేపీ నేత ఆచారి

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీ, శ్రీకాంత్ కాలనీల్లో శుక్రవారం నిర్వహించిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో ఆచారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ దివ్య, పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

సాలార్‌పూర్ గ్రామంలో..

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటికి బీజేపీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి బీజేవైఎం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు మల్లేష్, వెంకటేశ్, అంజయ్య, దశరథ్ తదితరులు ఉన్నారు.

నేడు జల్‌పల్లిలో మంత్రి పర్యటన

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం మంత్రి సబితారెడ్డి పర్యటిస్తారని కమిషనర్ వసంత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్‌పల్లి గ్రామంలోని 16వ వార్డులో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, 17వ వార్డులో రూ.39 లక్షలతో సీసీరోడ్డు, మన ఊరు–మన బడి పథకంలో భాగంగా జల్‌పల్లి పాఠశాలలో రూ.44 లక్షలతో చేపట్టనున్న పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. 16వ వార్డులో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ, బీటీ రోడ్డు పనులకు, రూ.15 లక్షలతో జల్‌పల్లి కమాన్ ప్రాంతంలోని అర్బన్ ఫారెస్ట్‌లో చిల్డ్రన్స్ పార్కు పనులను ప్రారంభిస్తారని ఆమె తెలిపారు.

ప్రిన్స్‌పాల్‌గా బాధ్యతల స్వీకరణ

తుక్కుగూడ: మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా డాక్టర్ జంగం విరూపాక్షప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఇప్పటి సంగారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల్లో ప్రిన్స్‌పాల్‌గా పనిచేశామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాతో పాటు, విద్యార్థుల ఉత్తమ ఫలితాలను పొందేందుకు కృషి చేస్తానన్నారు.

మహిళా సెక్యూరిటీగార్డు అదృశ్యం



పావని (ఫైల్)

పహాడీషరీఫ్: ఓ మహిళా సెక్యూరిటీ గార్డు అదృశ్యమైంది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రంగ నాయకుల కాలనీకి చెందిన వరికుప్పల మహేశ్, పావనీ(20) దంపతులు. పావనీ హార్డ్‌వేర్ పార్కులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంది. ఈ నెల 22న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన పావని తిరిగి ఎంతకూ ఇంటికి చేరుకోలేదు. ఆచూకీ కోసం అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

పంచాయతీలకు నిధులపై హర్షం

మహేశ్వరం: తుమ్మలూరులో జరిగిన సభలో సీఎం కేసీఆర్ మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని ఒక్కో పంచాయతీకి రూ.15 లక్షల చొప్పున మొత్తం 66 గ్రామ పంచాయతీలకు రూ.9 కోట్ల 90 లక్షల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శుక్రవారం మంత్రి సబితారెడ్డిని పెండ్యాల సర్పంచ్ మంత్రి సంధ్య రాజేష్ దంపతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి సబితారెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్‌ల పక్షాన మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో అడ్మిషన్ పొందడానికి ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారి బండి జగదీశ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పూర్తి వివరాల కోసం సెల్ నెంబర్ 9866166392ను సంప్రదించాలని కోరారు.

పెండింగ్ పనులను పూర్తిచేయండి

కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 15వ డివిజన్‌లోని పెండింగ్ పనులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. బడంగ్‌పేట కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జంగయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో మంచినీటి పైప్‌లైన్ల కోసం సీసీ రోడ్డును అడ్డంగా తవ్వేశారని, పైప్‌లైన్లు వేసేది పూర్తయినప్పటికీ రోడ్లు అలాగే వదిలివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మెథడిస్ట్ చర్చి ముందు మంచినీటి సరఫరా చేసే వాల్వ్ కోసం మున్సిపల్ సిబ్బంది గుంత తవ్వడంతో ప్రమాదకరంగా మారిందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని, 15వ డివిజన్లో సీసీ రోడ్లు పూర్తిచేయించాలని విన్నవించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీరాములు, అంజయ్య, నాగరత్నం, శ్రీధర్, అనిల్ తదితరులున్నారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం



అంబేద్కర్‌నగర్‌లో పర్యటిస్తున్న డీజీఎం సరిత

జలమండలి డీజీఎం సరిత

హుడాకాంప్లెక్స్: డివిజన్‌లో రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జలమండలి డీజీఎం సరిత అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి అంబేద్కర్‌నగర్, సీఎం రోడ్డులోని శ్రీనివాసకాలనీలలో శుక్రవారం ఆమె పర్యటించారు. రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ ఆధునీకరణకు రూ.13.2 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, రెండ్రోజుల్లో పనులు ప్రారంభం కానున్నట్లు వివరించారు. సీఎం రోడ్డులోని మురుగు సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీతోనే ప్రజలకు భరోసా



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అందెల, నాయకులు

అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: దేశ ప్రజలకు భద్రత, భరోసా కల్పించే ధైర్యం బీజేపీకి మాత్రమే ఉందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం జన్‌సంపర్క్ యాత్రలో భాగంగా రెండో రోజు గడప గడపకు పాదయాత్ర నిర్వహించారు. చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట శ్రీనిలయ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆత్మబలిదాన్ దివస్ కార్యక్రమంలో అందెల శ్రీరాములు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. జన్‌సంపర్క్ యాత్రను ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. 28వ వార్డులో సప్తగిరి కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకగర్గంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిత్రం శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

సభ్యులకు సత్వర సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వైస్ చైర్మన్ మూర్తి

మీర్‌పేట: వాటాదారులకు, సభ్యులకు సత్వర సేవలు అందించడంలో సిటిజన్ సొసైటీ ముందుంటుందని ఆ సొసైటీ వైస్ చైర్మన్ వై.ఎస్.ఆర్. మూర్తి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలోని ది సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బాలాపూర్ శాఖ వాటాదారుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మూర్తి మాట్లాడుతూ.. సొసైటీ మొత్తం వ్యాపారంలో డిపాజిట్లు రూ.1863 కోట్లు, రుణాలు రూ.160 కోట్ల స్థాయిని అధిగమించిందని అన్నారు. అనంతరం సొసైటీ డైరెక్టర్ సోమలింగం గౌడ్, డైరెక్టర్ మన్‌సాని శ్రీనివాస్, సుబ్బయ్య మాట్లాడుతూ సిటిజన్ సొసైటీ అభివృద్ధి బాటలో పయనిస్తూ, సామాన్య ప్రజల అవసరాలకు బంగారు ఆభరణాలపై ఎక్కువ మొత్తంలో రుణాలు ఇస్తున్నామని చెప్పారు. అదేవిధంగా సొసైటీ ఆరు రాష్ట్రాల్లో శాఖలను విస్తరించి సేవలందిస్తోందన్నారు. సమావేశంలో బాలాపూర్ శాఖ మేనేజర్ మధుమోహన్, సిబ్బంది యాదగిరి గౌడ్, రమాదేవి, మురళి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య



మిల్లెట్స్ టిఫిన్‌లను అందజేస్తున్న సత్తయ్య

తుర్కయంజాల్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో చిరుధాన్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కౌన్సిలర్ మంగమ్మ, కాంగ్రెస్ నాయకులు శివకుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా చిరుధాన్యాలతో చేసిన టిఫిన్‌లను అందజేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఫర్టిలైజర్స్ ఉపయోగించి పండించిన పంటలతో చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు రావడం పరిపాటిగా మారిందన్నారు. షుగర్, బీపీ, థైరాయిడ్, గుండెపోటు, అధిక బరువు వంటి సమస్యలతో సతమతమవుతున్న వారు చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నయ మిల్లెట్స్ నిర్వాహకులు అమర్ సంకీర్తన రెడ్డి, రఘు, మాజీ సర్పంచ్ దశరథ, నాయకులు రమేష్, శంకర్ పాల్గొన్నారు.

రాచకాల్వపై కాజ్‌వే నిర్మించండి

ఎమ్మెల్యే మంచిరెడ్డిని కోరిన సర్పంచ్ రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి నీరొచ్చే రాచకాలువపై కాజ్‌వే నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి కోరారు. ఎల్మినేడులోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. కాజ్‌వే లేకపోవడంతో కాల్వలో పెద్ద లారీ పడిపోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే.. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి ఫోన్ చేసి శనివారం సంఘటనా స్థలానికి వెళ్లి కాజ్‌వేకి అవసరమైన నిధులకు సంబంధించి అంచనా సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.